

# టెంకిజెల్ల

కె.ఎన్. మల్లీశ్వరి

"నన్నొగ్గీ."

"నానొగ్గనే."

"నన్నొగ్గీమంతన్ననా..."

"ఎహే... నానొగ్గనుగాక ఒగ్గనుగాక ఒగ్గనే."

"ఓరి ముష్టిడా! నాను నీతోటి కాపరం సేయనని సెపుతున్నను గదా... యిన్నాల్లూ నా బతుకు దుంప నాశినం సేసావు గదరా! ఒగ్గీమంతే ఒగ్గీకుండా యింకేటి సేస్తవురా! యిగో... యిది సుత నా జోలికొచ్చినవంటే మరేదగుండదు. నాను నీలా టక్కులమారిదాయిని గాను. నన్నొగ్గేత్తే దరమంగా వుంటది," మొటాయిస్తా అంది తెలగమ్మ.

అగ్గయిపోనాడు ఆదెయ్య.

"ఒలే.. దెష్టమొకందానా... ఏలనే నిన్నొగ్గీవాలి? నాను నిన్ను గాడంగా పేమిత్తున్నానని సెపతన్నాను గదే... అయినేటే నీ ఒంటిపోత్రం? మనిద్దరవూ శానా అయిక్కంగా వుండాలే దరిద్దరపు మొకందానా... మొగుడూ పెల్లాలన్నాక సవాలచ్చ వొత్తుంటాయి పోతుం టాయి ఆ పాటికే ఎలగే ఒగ్గీడం? యీపాలి వొగ్గీమన్న వంతే చెమడాలెక్కదీస్తనే... అయినగానీ ఈ బిజారెం దుకు? రాయే తెలగా పేమించుకుందము," తెలగ మ్మని జోరుకుని కావిలించుకోబోయాడు ఆదెయ్య.

"మీదకొచ్చినవా పీక పిసికి సంపేత్తను," అత్తలికి గెంతుతూ తాటించినాది తెలగమ్మ.

ఈ మొగుడూ పెల్లాల తగూ సానా ఏళ్ల నుంచీ నలగతానే వుంది. ఆకాడికొత్తే లగ్గాలకి ముందే ఎడ మొకం పెడమొకం పెట్టీసుకున్నరు. సివరాకరికి పెద్ద మడుసుల ఒప్పందాలతో లగ్గం అయిందనిపించీసి నారు. పాకం ముదిరి అరిసెలు గుండయినట్టు ఏళ్లు గడిచి తగూలు లావయిన కొద్దీ ఎడం పెరిగిపోనాది.

"ఈ నాలిముచ్చుగాడితో నానిక కాపరం సెయ్యనుగాక సెయ్యనని," ఈ మద్దెన రలాయించి సెప్పేత్తంది తెలగమ్మ.

"ఏల నాతో కాపరం సెయ్యదో సూతుము," అనీసి బుర్ర పట్టని మాటలు పేల్తుంటాడు ఆదెయ్య.

యిలగ మొగుడూ పెల్లాల తగూతో వూరు వూరంతా అగ్గిపైరయిపోతుంటది.

వూళ్లో పెద్దమడుసులందరికీ ఈ తగూతో సచ్చే సావొచ్చి పడినాది. సిన్న సిన్న తగూల రోజుల్లో ఆడబొట్టి బాదతో కంకటిల్లి పోతున్నదని సెప్పి పెతీ పెద్దమడిసి తెలగమ్మ కాడికి బోయి, "సూడే తెలగా... నీ బాదలన్నీ మాకెరికేనే... ఎవళెట్టాబోయినా మావు మాత్తరం నీ పచ్చం వుంటం ఖాయం సేసుకోవే," అని అవాకులు సెవాకులు పేలీసినారు. అన్నీ నమ్మీసినాది తెలగమ్మ. యీల్లంతా తన పీడ యిరగడ సేసీత్తారనీసుకుంది. కానీ మద్దికాన ఆదెయ్య పితలాటకం పెట్టీసినాడు.

"ఠాట్... నానొల్లకోను. నానేటి సెప్పినా తెలగమ్మ పల్లకోని కూకోవాలి. నాను తెలగమ్మ నొగ్గేది మాత్తరం నేదు. ఎవళడ్డం వత్తారో సూద్దుమా... బత్తీమే సవాల్," అనీసినాడు. ఆదెయ్య తొడ గొట్టీసరికి పెద్ద మడుసులు తత్తరిల్లిపోనారు.

"తెలగమ్మ నొగ్గీరా అంటే ఆదెయ్యకి కోపం.. ఆడొగ్గడంట.. పోనీ పల్లకోయే అంటే తెలగమ్మకి కోపం. కరిసీమంటే కప్పకి కోపం... వదిలీమంటే పావుకి కోపం...

మావేటి సెయ్యలేం,'' అనీసి అనువులు మినువులన కుండా కూకున్నారు పెద్ద మడుసులు.

అప్పుడొచ్చినాది తెలగమ్మకి కోపం... ''ఒరయ్యెల్లారా! కరిసీమంటే కప్పకీ కోపవే వదిలీమంటే పావుకీ కోపవే... నిజ్జిమే... నానొప్పీసుకుంతను కానయితే దరమ పెబువుల్లాలా! లోకంల కరిసీడం మరేదా? వదిలీడం మరేదా? తవరు తేల్సి సెప్పాల. ఎవళు పావు పచ్చాన వుంటరో ఎవళు కప్ప పచ్చాన వుంటరో తేల్సుకోవాల అదీ దరమము. అల్లప్పటిదాకా నానూ నా బందు గణమూ మీ ఇళ్లల్ల మీ పొలాలల్ల పనులు సేయము. ఇల్లింతదాకా తవరందరికీ నానొట్టి ఎర్రిపీరునాగా అవుపడ్డాను. ఇహన తెలగమ్మంటేటో అందరికీ తెలవాల,'' అగ్గిబరాటాలా మండిపోతూ అనీసింది తెలగమ్మ.

తెలగమ్మ తన తరుపోల్లందరితో కల్సి వుద్దెమం సేత్తందని ఆదెయ్యకి తెల్సి పోనాది.

''ఏటేస్!! మూలన కూకోనుండాల్సింది ముందు కొచ్చి గెంతులేత్తంటే పెద్ద మడుసుల ఇళ్లల్ల పొలాలల్ల పనులకి నిట్టమోసేది మనవేన్రా! అంత నిస్సాకారం సన్నాసులవేట్రా మనము? ఆళ్లిళ్లిల్ల పొలాలల్ల పనులు మనవూ మానేతుము.. వుద్దెమాలు మనవూ సేతుము,'' అనీసి పుంజీడు మడుసుల్ని ఎంటేసుకుని తెలగమ్మ ఏటిసెస్తే తనూ అలగే సేయడం మొదలుపెట్టినాడు ఆదెయ్య.

ఈ తీరుగా ఇత్తలోల్లు అత్తలోల్లు అవ్వాయి సువ్వాయిల్నాగా ఎగిరిపోతా వుంటే వూరు అల్లకల్లోలం అయిపోనాది.

*

మెత్తగా అడిగితే లాబం నేదనీసి తెలగమ్మ తరుపోల్లంతా వూరు మీద కట్టు కట్టీసినారు. పెద్ద మడుసులు సెప్పే పనులకి పోడం మానీసారు. రోడ్లల్ల వంటలు వండీసి బోజి పెట్టుకోడం, ఆ యీది నుంచి ఈ యీదికొచ్చే బళ్లు సైకిల్లని ఆపీడం తెలగమ్మ గొప్పతనం మీద, తెలగమ్మ బాదల మీదా పాటలు గట్టి యీదీది తిరిగి ఆలపించడం లాటి పనులు రోజుకొక్కటి సొప్పున సేత్తన్నారు.

ఏడ జూసినా జై తెలగమ్మ నినాదాలే సెవిల బడ్డంతో ఆ కాసి పోడానికే పెద్ద మడుసులు తత్తరబిత్తరై పోతన్నరు. ఒకేళ తప్పనిసరయిపోయినా బుర్రకాయెంచుకోని జాకర్లేసుకుంటూ ఎల్పొచ్చిత్తంటే ఏమూల నుంచో లటక్కన ఆళ ముంగలకి దూకేత్తంది తెలగమ్మ.

''బావూ నాగురించేతి సేస్సినావూ... ఆ ఆదెయ్యకి గడ్డిపెడతవానేదా? నన్నొగ్గీమని సెపతవానేదా? ఆడు మీ ఆడబొట్టికి ఇంతన్నాలం సేత్తంటే సూత్తా పల్లకుంతవా? నీవేటి పెద్దమడిసివి,'' అంటూ జలకడిగేత్తంటే జవజవలాడిపోయి ఎలగో ఒకలాగా మాయసేసి తప్పించీసుకొచ్చిత్తంటే ఇంకో మూల నుండి ఆదెయ్య పీకట్టీసుకుంటాడు.

తెలగమ్మ కాడపోయిన పేనాల్ని ఆదెయ్య కాడ సిక్కబట్టుకొని, ''బెంగెట్టు కోకురయ్యా, నీవూ తెలగమ్మ మాకు రొండు కళ్లలాటోళ్లు. ఏ కన్ను గావాలంటే ఏటి సెప్పగలం? వురుమురిమి మంగళం మీద బడినట్లు మీ మొగుడూ పెల్లాల తగూ మా పేనాల మీదికొచ్చినాది. మావు పెద్దమడుసులుగా వుండగానే యిల్లు సక్కబెట్టుకుందామనీసుకున్నాం. కుదిరేనాగా నేదు. సివరికి సిప్ప తప్ప ఏటీ సేతికి వచ్చేనాగా నేదు గదరయ్య... మా బాదలు మావు ఎవళకి సెప్పాలిరయ్యా...'' అంటూ ముక్కులు సీదేసినారు. సీది సీది ముక్కులు ఎర్రబడే సరికి ఇహన లాబంనేదని సెప్పీసి ఆదెయ్యనీ తెలగమ్మనీ ఎదురూబొదురూ కూకోబెట్టీసి... ''ఒలే! తెలగా! ఆడు నిన్నెందుకు ఒగ్గీవాలో ముంగల సెప్పవే,'' అనీ సరికి తెలగమ్మ అందుకుంది. లగ్గం అయిన కాడినుండీ తను అనుబగిత్తన్న బాదలన్నీ సెప్పుకొత్తంటే తెలగమ్మకి అచ్చులు పచ్చులుగా కోపం ముంచుకొచ్చీసినాది.

''ఇలాటోడీడు. నాను నీతో కాపరం సెయ్యనురయ్యా అంటే యినుకోడు... పౌరుసం మాలినోడు సిస్సీ...'' సీదరించేసినాది తెలగమ్మ.

తెయ్యిమంటా లేసాడు ఆదెయ్య.

''ఒలే... దెస్టా మా గోరోజినం బలిసినాదే నీకూ! నిన్నొగ్గీడానికి చణం పట్టదే నాకూ... మిట్టకాయేసినంత సేపు... ఇల్లిదిగో మిట్టకాయయేసినంతసేపు పట్టదే. మరి నానెందుకు ఒగ్గనంతన్నాను. నాకాడ పాయింటున్నాది. పాయింటు లేందే నానేపనీ సేయను. నాను నిన్నొగ్గిత్తాను సరే మరి నీ కాడున్న సొనపకాయ సంగతేటే? సంపాయిచ్చిన ముల్లె అంతా సొనపకాయలో దాపెట్టీసి వొగ్గీమంటే ఎర్రిపీరునేటే?'' పాయింటుకొచ్చాడు ఆదెయ్య. నోరావలించింది తెలగమ్మ.

''ఓరి తరకబోతా... సొనపకాయ మీద పేమ తప్ప నామీద గాదన్నమాట... అయనారే నా మొలన సీర సివర్లల్ల మూట గట్టుకుని దాసుకున్న సొనపకాయ నాదవుతుంది గానీ నీదెలగవుతుందిరా?''

''ఓసోస్... సొనపకాయలోన సొమ్ము నీవే సంపాయిచ్చినావేటే? వసలకి నీవు బెండగొడ్డునాగా కూకోనుంటే నాను కట్టపడి సాయంసేసాను గాబట్టి సొనపకాయ నాది,'' గట్టిగా అనీసాడు ఆదెయ్య.

"డచ్చీలు కొట్టకురారే... నీవు మాకాని గండడివి గాప్పోతే నా సొనపకాయలో సొమ్మెందుకు దాపెట్టీనావు? అసలకి సాయం జెయ్యమని నిన్నెవళు అడిగీనారు? నానే బెండగొడ్డునయితే నీవు మంటిబుక్కడం కన్నా ఏటి తక్కువ?" అంటూ ఇలగ తెలగమ్మ, ఆదెయ్య అబ్బడ్డ తిట్లూ తిట్టీసుకున్నాక, "యీ తెలగమ్మ ఎవళకి గావాలి? నాకు సొనపకాయ నిచ్చేత్తే తెలగమ్మ నొగ్గీత్తాను," అనీసాడు ఆదెయ్య.

"సొనపకాయ నొడికీడానికి ఇంత గత్తర సేసినావురా!! సొనపకాయ నా పేనం... పేనాలిచ్చీమంత వురా!?" గయ్యిమంది తెలగమ్మ.

సూత్తా కూకున్న పెద్దమడుసుల నెత్తిమీద నుంచి తెలగమ్మనీ ఆదెయ్యనీ తోసేసి సొనపకాయ ఎక్కి కూకుంది.

*

ఆరోజు గేమసబ వుందనీసి పెజలంతా ఆళ బాదలూ తగూలూ పెద్దమడుసులకి సెప్పి పంపితే ఆళు గేమసబకి విన్నవించి తునితగవు సేత్తారనీ బారి కోడు సాటింపు ఏసాడు. తెలగమ్మ, ఆదెయ్య ఎవళకి ఆళు మల్లా ఆళ బాదలు పెద్దమడుసులకి యినిపించారు. ఎప్పట్లాగానే ఆళ్లూ ఎటూ తేల్సకుండా, 'సూతుము సూతుము,' అని తల తాటించేసి పల్లకున్నరు.

కానీ పెకాశంనాయుడు అలగ పల్లకోనేదు. తెలగమ్మని తప్పుబట్టీసినాడు. మొగుడూ పెళ్లాలు అయిక్కంగా వుండాలనీసినాడు. సొనపకాయ తెలగమ్మది ఎలగవుతుందనీసినాడు. అల్లదిగో అక్కడొచ్చినాది తెలగమ్మకి కోపం. కానీ ఏటనడానికీ పెకాశంనాయుడు గోరంటే ఎవళు? 'పెద్దమడుసులలోన గొప్ప మడుసులు ఏరయా' లాటి మడిసి.

పెజలకోసం తాగాలు సేసి పెజల కోసవే సవారుగా నడిసే మడిసి. అలాటోడు అక్కడా ఇక్కడా నా గురించేటి యిలగ పేల్తన్నాడనీసి తెలగమ్మకి సికాకు బుట్టేసినాది. అసలకి నమ్మలేకుంతన్నాది.

అంగబలం అరద్దబలం నేప్పోయినా ఆరేటి సెప్పినా పెపంచకం సెవొగ్గి యింటది. అలాటి బావు ఇలగ అద్దవయితంగా మాటాడటమేటో అనీసి తెలగమ్మ తరుపోల్లంతా ముక్కున ఏలేసుకున్నారు. దాంతో పల్లకోకుండా పెకాశంనాయుడుగోరు గేమసబకి ఒచ్చినపుడు ఎలగయినా ఆయనగారి టక్కుటమారా లేటో నిలదీయాలని తెలగమ్మ తరుపోల్లు నిచ్చయించుకున్నారు.

ఆరోజు గేమసబలో తెలగమ్మ ఆదెయ్యల తగూ యిసయం పెద్దమడుసులు మాటాడుకుంతారనీసి టీవీలోల్లకీ పేపర్లోల్లకీ తెల్సిపోనాది. ఆళు రెక్కలులేని పచ్చుల్నాగా వాలిపోనారు. గేమసబ బయటంతా ఆలదే రాజ్జెం. లోపలేటి జరిగిపోతన్నాదో అనీసి ఆలందరికీ బుర్ర సలపెట్టేత్తన్నది. రొంత తాలినాక సబలోన సబ పరులు ఆదెయ్య తెలగమ్మ తగూ గురించి సందీ మందీగా గోడ మీద పిల్లుల్నాగా మాటాడితే పెకాశం నాయుడుగోరు మాత్తరం ఆదెయ్య పచ్చాన పలికినట్లు అగొబ్బుగా తెల్సిపోనాది.

వుప్పందుకున్న తెలగమ్మోలంతా ఎకాఎకీన వచ్చీసినారు. అక్కుర్లు బక్కుర్లుగా వచ్చీత్తన్న కోపాన్నీ దుఃఖాన్నీ ఆపుకుని ఒబ్బిడిగా కూకుంది తెలగమ్మ.

సబ ముగిసినాది. పెద్దమడుసులందరూ బయటకి వచ్చి తెలగమ్మని సూస్సి తైరు నవ్వుకొట్టి టీవీలోల్లకి దొరక్కుండా దస్నాట్లు పడుతూ జారుకున్నారు.

తెలగమ్మ ఏటననేదు. సూస్తా ఊరుకుంది. ఇంతలోట పెకాశంనాయుడు తాపీగా తండాడుతూ వొస్తూ కనిపించాడు. దిగ్గున లేసింది తెలగమ్మ. బందుగణమూ దిగ్గున లేసారు. పెకాశంనాయుడిని సుట్టుముట్టీసినారు. సిన్న అలికిడికే ఉలిక్కిపడే టీవీలోల్లు ఆపాటికే అందరి మొహాలల్లా కెమరాలు పెట్టేసినారు.

తెలగమ్మ గుత్తకత్తె మాదిరి ముందుకొచ్చి, "ఏటి బావూ... సబలోన వుపన్నాసం దుళ్లగొట్టీసినావంత?" అంది

ఉందాగా సిరునవ్వు నవ్వీనాడు పెకాశం నాయుడు.

"బావూ నానొక ఆడబొట్టిని. నాకెంత అన్నాలం జరుగుతుందో నానెప్పటి నుంచీ సెప్పుకొత్తన్నాను? మరి నీవేటి యిన్నావు? నా బాదలు నీకు అవుపడ్డం నేదా? ఆదెయ్యతో కల్సి నీవు అంతకానికి పూనుకున్నావనీసి లోకంల ఎందరు సెప్పినా నాను యిదలకించాను. సొనపకాయ ఆడిది కూడా అనీసి మావిద్దరం అయిక్కంగా వుండాలనీసిని నీవెలగ సెప్పుతున్నావు? నీకు దరమం అనేటిది నేదా? గొప్ప మడిసివి నీవే ఇలగంటే నాను ఎందలెల్లి పడాల?" తెలగమ్మ ఏకరువు పెడుతుంటే సేయెత్తి వారించి గొంతు సవరిచ్చుకున్నాడు పెకాశంనాయుడు.

కెమేరాలూ మైకులూ తెలగమ్మ మొహం మీద నుంచి పెకాశంనాయుడు మొహం మీదకి బెల్లం సుట్టూ ఈగల్నాగా ముసిర్నాయి.

"ఒలే తెలగా నానొకటి సెప్తాను ఆలించు. అసలకి మనవంటే ఎవళం? పౌరులం. యీ పెజాసామ్మెంల

యీ రాజ్యాంగంల పౌరులందరికీ అక్కులుంటాయి... ఆటిని మనం గవురవించాల. ఆదెయ్యకి నీతో కల్సి వుంటాననే అక్కు వుంటది. అలాగే యీ పెజాసామ్మెంల యీ రాజ్యాంగంల పౌరులందరికీ కొన్ని బాద్దెతలు కూడా వుంటాయి. ఆటినీ మనం గవురవించాల. ఆదెయ్యతో అయిక్కంగా ఉండాల్సిన బాద్దెత నీకున్నాది. నీ బాద్దెతని నీకు గుర్తుసేసానంతే,'' అనీసాడు పెకాశం నాయుడు.

టీవీలోల్ల కళ్లతో, టీవీలోల్ల సెవులతో యింటన్న పెజానీకం అంతా టపటపా టప్పట్లు కొట్టీసినారు.

''అక్కులు ఆళకి, బాద్దెతలు మాకూనా బావూ...'' తెలగమ్మ తరుపోల్లలో ఎవళో తావసం ఆపుకోనేక అనీసారు. పెకాశంనాయుడు ముక్కుమీద ఏలుంచి తల అడ్డంగా ఆడిస్తూ... ''అశ్శ!! నానలగ సెప్పనేదూ... అసలకి మన పౌరులందరమూ పెపెంచకంలో వున్న ఎన్నో బాదల గురించి మాటాడుకోవాలగానీ ఇలాపింటి సిల్లర తగూల గురించి మాటాడుకోకూడదు,'' అనీసి యిశ్రాయంగా వుపన్నాసం యిస్తాబోతన్నాడు.

యింటన్న తెలగమ్మ తరుపోల్లు కుతకుతా వుడికిపోతన్నారు. సూసిసూసి ఎంతకీ పెకాశంనాయుడు వుపన్నాసం ఆగకపోయాసరికి ఆళలోంచి నెమ్మదిగా ఓ పిక్కిరోడు పైకినేసి ఒక్క ఎగురు ఎగిరి ఎనకనుంచి సాటు సేసుకుని పెకాశం నాయుడిని ఒక్క జెల్లకాయ పీకీసి గమ్మునుండిపోనాడు. ముంగలకి తూలాడు పెకాశం నాయుడు.

చణంలో అక్కడంతా అల్లకల్లోలం అయిపోనాది. ఏటి!! ఏటేటి!! ఏటేటేటి జరిగిపోనాది!! ఓలమ్మోలమ్మోలమ్మో!! పెకాశంనాయుడుగోరికి టెంకిజెల్ల తగిలీసినాది. ఎంత పనయిపోనాది! యీ గోరానికి పెజలు పరుగులు పెట్టీసినారు. టీవీలోల్లు సెకసెకా లైవులు పెట్టీసుకున్నారు. ముందటి టెంకిజెల్లని సరింగా కవరు సేసుకోని టీవీలోల్లు మల్లెవరన్నా టెంకిజెల్ల పీకితే బావుండునని తెలగమ్మ తరుపోళ్ల కాసి ఆశిగా సూత్తన్నారు.

''అప్పలకొండా... అలో... అలో... అప్పలకొండా... అక్కడేటి జరిగిపోతన్నాది!!! అక్కడ పరిత్తితి ఎలగున్నాది?'' అంటూ టీవీ లెవన్ టూడియో నుండి యాంకరమ్మ నరిసి, రిపోరటరు అప్పలకొండని గాబరా పెట్టేత్తంది.

''నరిసీ... ఇక్కడ పరిత్తితి సానా దారుణంగా వుంది నరిసీ. సానా అద్దోన్నంగా కూడా వుందనీసి సానా మంది అంటన్నారు నరిసీ... యీ రోజు ఇక్కడ పెజాసామ్మెం కూనీ అయిపోనాదని అన్పిస్తుంది నరిసీ... సూత్తా వుంటే పెపంచకంలోకెల్లా పెద్ద గోరం ఇక్కడ జరిగిపోనాది నరిసీ... ముందుగాలా ఆ గోరాన్ని పెపంచకానికి మనవే తెలియజేస్తన్నాం నరిసీ. పెజలందరూ టీవీ లెవన్‌ని అబినందనలతో ముంచేత్తన్నారు నరిసీ... యిసయంలోకి వత్తే పెకాశంనాయుడుగారికి తగిలిన టెంకి జెల్లని సూసినోల్ల గుండె సెరువైపోయింది... నరిసి...''

''అప్పలకొండా... మరైతే పెకాశంనాయుడుగారికి మల్లా టెంకిజెల్ల తగిలే అవకాశాలు ఏవైనా ఉన్నాయా?''

''వున్నాయి నరిసీ... వున్నాయనే అందరూ అంటున్నారు నరిసీ...''

''అప్పలకొండా... పెకాశం నాయుడుగోరికి టెంకిజెల్ల ఎలగ తగిలిందో ఎవలు పీకినారో పెకాశం నాయుడిగోరు ఏటనుకుంతన్నారో తెలుసుకోడానికి టీవీ లెవన్ పేక్షకులంతా పళ్లాల్లో టిపినీలు పెట్టుకుని టీవీల ముంగల కూకుని సానా ఆందోళనగా ఎదురుసూత్తన్నారు. నీవోపాలి ఆయన్ను పలమర సేస్సినావంటే...''

''నానందుకే సూత్తన్నాను నరిసీ... కానైతే జెల్ల తగిలీసినాక పెకాశంనాయుడు గోరు ఇక్కడెవలకీ అవుపడనేదు నరిసీ... ఎక్కడున్నా ఎతికిపట్టి మరీ ఆరిని పలమర సేస్సి నీకు సెప్తాను నరిసీ... ఇప్పటికింతే... నరిసీ... కెమరామాన్ సిమ్మాసెలంతో... అప్పలకొండ... టీవీ లెవన్.''

అక్కడ జరుగుతున్న గందరగోళానికి తెలగమ్మ తరుపోల్లంతా బిక్కబిడిసి పోనారు. తెలగమ్మ మనసు నొచ్చింది. పిక్కిరోల్ల మీద కేకలేసి ఇంటికొచ్చి పల్లకుండా కూకుండిపోయింది.

*

ఆ గొడవ తరాత వూర్ల అందరూ మీటంగిలు బెట్టి పెకాశంనాయుడుగోరికి తగిలిన టెంకిజెల్లని తీవ్వరంగా కండించీసినారు. పెద్దమడుసులందరూ ఆ మీటంగిల్లో మాటాడుతూ ఆరోజు పెజాసామ్మానికి దురిదినమని సెప్పీసినారు. పేపర్లల్ల, టీవీలల్ల యీ ఉదంతం మారుమోగిపోనాది. పెపంచకం అంతా ఆదెయ్యనీ తెలగమ్మనీ వదిలేసి పెకాశంనాయుడు పచ్చాన నిలబడిపోనాది. కోరుట్లు గూడా సూమోటో కేసు కింద పెకాశం నాయుడుగోరికి నాయం సేసీయాలని వుబలాటపడిపోనాయి. కానీ నాయం సేయించుకోడానికి పెకాశం నాయుడు మాత్తరం అయిపునేడు. రెండ్రోజులూ, మూడ్రోజులూ వారంరోజులూ ఎవలెంత ఎతికేసినా

ఎవళ సేత పలమర సేయించుకోడానికి అందు బాటులో నేడు.

ఆరోజు తెలగమ్మ తనోల్లతో కల్సి పక్క యూదికి పోతంటే పెద్దమడుసులతో కల్సి గోర్జలోన ఎదుర య్యాడు పెకాశంనాయుడు. ఎనకాల పలమర సేయించుకోమని బతిమాలాడుతూ టీవీ లెవన్ అప్పల కొండ... పెకాశంనాయుడు తెలగమ్మని సూడగానే అల్లక్కడ సిటం ఆగి తెలగమ్మని సూడనట్టే పక్క సూపులు సూసి సటుక్కున ఎనక్కి తిరిగి అప్పలకొండ పలమరని అందుకుని... "అసలకి ఈ పెపంచకంలో తెలగమ్మ పడినన్ని బాదలు ఎవళుబడ్డారు? ఇన్నాళ్లూ మనం మిటకరించి సూత్తా కూకోడం తప్ప ఏటి సేసినం? అది సానా తప్పు కాబట్టి నాను సెప్పేది ఒకటే... యీ పెజాసామ్మెంలం, యీ రాజ్యంగంల ఒద్దనీసుకుంతే యిడిపోయే అక్కు అందరికీ వుంటాది. తెలగమ్మకీ వున్నాది అని నాను సవినయంగా మనవి సేసుకుం తన్నాను," అనీసి తెలగమ్మ వంక దవిరంగా సూసాడు పెకాశంనాయుడు.

పెకాశంనాయుడు మాటలు విని తెలగమ్మ తరు పోల్లల్లో పిక్కిరోల్ల గుంపు ఉల్లాసం పట్టనేకపోయింది. అల్లల్లోంచి ఓ పిక్కిరోడు ముందుకొచ్చి వుపన్నాసం మొదలెబెట్టాడు.

"తెలగప్పొ సూసినావు గదా... ఇహన టెంకిజెల్ల మనకి ఒక పోరాటరూపము... ఒక వుద్దెమ దీపము. ఇహనుండీ వాడవాడలా టెంకిజెల్ల కార్యక్రమములు ఏర్పాటుసేతుము. పెతి పెద్దమడిసికీ రుసి సూపిం తుము. టెంకిజెల్లే మాకాదర్శము... జై టెంకిజెల్ల... జైజై టెంకిజెల్ల..." పెద్దమడుసులకేసి పెంకిగా చూశాడు.

పిక్కిరోడి మాటలు ఆలించి పెద్దమడుసులు మొహాలు మాడిసేసి, "ఒలే తెలగా... పిక్కిరోల్లకి ఇలగ నేటే కిర్రెక్కిత్తన్నావు!! ఇదేటన్న మరేదగుందే"! అంటూ నిష్టురపోయారు.

తెలగమ్మ ఎనక్కి తిరిగి "ఓరి పిక్కిరోడా పల్ల కోరా..." అని గసిరేసి,

"...బావూ తవరు సెప్పింది నిజ్జివే... మా పిక్కి రోడు అన్నది సేసింది తప్పే నా నొప్పీసుకుంతను. కానయితే బావు... ఒకటి సెపుతాను ఆలకించు... పెద్ద మడుసుల నాలిక్క నరం నేప్పోతే పిక్కిరోల్ల గేనవే పీక మెక్కుతుంది అన్నది సత్తెం... ఆలోసించుకోండి మల్ల..." అనీసి పల్లకుంది తెలగమ్మ.

---

| | | |
|---|---|---|
| *నిట్ట మోసేది* | - | *బాధ్యత పడటం* |
| *జాకర్లు* | - | *అంగలు పగలు* |
| *జల కడిగేడం* | - | *గట్టిగా చీవాట్లు చేయడం* |
| *మిట్టకాయ* | - | *చిటికె* |
| *బెండగొడ్డు* | - | *సోమరి* |
| *మంటి బుక్కడం* | - | *బద్ధకంగా కదిలే బురదపాము* |
| *గత్తర* | - | *చెత్త* |
| *సబపరులు* | - | *పెద్దమనుషులు* |
| *దసనాట్లు* | - | *నానా కష్టాలు* |
| *దుళ్లగొట్టడం* | - | *అదరగొట్టడం* |
| *పిక్కిరోడు* | - | *పిల్లోడు* |
| *పలమర* | - | *పరామర్శ* |
| *దవిరం* | - | *ధైర్యం* |
| *కమ్మగట్టడం* | - | *ఏడిపించడం* |
| *సొనపకాయ* | - | *ఉత్తరాంధ్ర స్త్రీలు విలువైన చిన్న వస్తువుల్ని (నగలు, డబ్బు) చీరకొంగు చివర్ల మూటగట్టి మొలన దోపుతారు.* |

***ఆదివారం వార్త, 2 అక్టోబర్ 2011***